గల్లా రామచంద్ర నాయుడుకు జీవితకాల సాఫల్యం అవార్డు

ప్రజాశక్తి- రేణిగుంట: అమర రాజా గ్రూప్ వ్యవస్థాపకుడు డాక్టర్ గల్లా రామచంద్ర నాయుడు ప్రతిష్టాత్మక మహాత్మా జీవితకాల సాఫల్యం అవార్డు 2024ని అందుకున్నారు. గల్లా రామచంద్రా మాట్లాడుతూ తాను జీవితకాల సాఫల్యానికి మహాత్మా అవార్డును అందుకోవడం ఒక గౌరవంగా భావిస్తున్నానని, ఈగుర్తింపు వ్యాపార విజయాన్ని నడపడానికి, సమాజంపై సానుకూల, శాశ్వత ప్రభావాన్ని సృష్టించేందుకు నిబద్ధతను పునరుద్ఘాటిస్తుందని అన్నారు. తాము అర్ధవంతమైన కార్యక్రమాల ద్వారా సమాజాన్ని మెరుగుపరచడానికి ఎల్లప్పుడూ కృషి చేస్తూనే ఉంటామని అన్నారు.

బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవం

- నేడు ధ్వజారోహణం
- ముఖ్యమంత్రి పట్టువస్త్రాల సమర్పణ

విద్యుత్ వెలుగులో శోభాయమానంగా తిరుమల

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఈనెల 4 నుంచి 12వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించడానికి టిటిడి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. వాహనసేవలకు విచ్చేసే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు టిటిడి ఏర్పాట్లు పూర్తిచేసింది. భక్తులందరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా శ్రీవారి వాహనసేవలతో పాటు మూలవిరాట్ దర్శనం కల్పించేందుకు టిటిడిలోని అన్ని విభాగాలు సమన్వయంతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఉదయం వాహనసేవ 8 నుండి 10 గంటల వరకు, రాత్రి వాహనసేవ 7 నుండి 9 గంటల వరకు జరుగుతుంది. గరుడవాహనసేవ సాయంత్రం 6.30 నుండి రాత్రి 11 గంటల వరకు జరుగుతుంది. ఆలయ నాలుగు మాడ వీధులలో భక్తులను ఆకట్టుకునేలా రంగవల్లులు తీర్చిదిద్దారు. గ్యాలరీలలో వేచివుండే భక్తుల సౌకర్యార్థం తాగునీరు, మరుగుదొడ్లు అందుబాటులో ఉంచారు. భక్తులు మాడ వీధుల్లోని గ్యాలరీల్లోకి ప్రవేశించేందుకు, తిరిగి వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బారికేడ్లు, క్యూలైన్ల గేట్లు పటిష్టంగా ఏర్పాటు చేశారు.

4న ధ్వజారోహణం

4వ తేదీ శుక్రవారం సాయంత్రం 5.45 నుండి 6 గంటల మధ్య మీన లగ్నంలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమవుతాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారి సమక్షంలో వేదగానాల మధ్య మంగళవాద్యాలు మోగుతుండగా అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజాన్ని ఎగురవేస్తారు. ఈ కార్యక్రమం ద్వారా సకల దేవతలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తారు. ఆ తరువాత రాత్రి 9 నుండి 11 గంటల వరకు పెద్దశేషవాహన సేవ జరుగుతుంది.

మొదటిరోజు రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు ఏడుతలల స్వర్ణ శేషవాహనంపై (పెద్ద శేషవాహనం) తిరుమాడ వీధులలో భక్తులను అనుగ్రహిస్తారు. 5న చిన్నశేషవాహనం. స్వామివారు ఐదు తలల చిన్నశేష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి శ్రీమలయప్పస్వామివారు వీణాపాణియై హంసవాహనంపై సరస్వతిమూర్తి అవతారంలో దర్శనమిస్తారు. 6న మూడో రోజు ఉదయం శ్రీ మలయప్పస్వామివారు సింహవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి ముత్యపుపందిరి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. 7న నాలుగో రోజు ఉదయం శ్రీమలయప్పస్వామివారు ఉభయదేవేరులతో కలిసి కల్పవృక్ష వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారు సర్వభూపాల వాహనంపై భక్తులకు అభయమిస్తారు. 8న ఐదో రోజు ఉదయం శ్రీవారు మోహినీరూపంలో శృంగారరసాధి దేవతగా భాసిస్తూ దర్శనమిస్తాడు. పక్కనే స్వామి దంతపుపల్లకిపై వెన్నముద్ద కృష్ణుడై మరో రూపంలో అభయమిస్తాడు. రాత్రి గరుడవాహనంలో జగన్నాటక సూత్రధారియైన శ్రీమలయప్పస్వామివారు తిరుమాడ వీధులలో నింపాదిగా ఊరేగుతూ భక్తులందరికీ తన దివ్యమంగళ రూపదర్శనమిస్తాడు. 9న ఆరో రోజు ఉదయం శేషాచలాధీశుడు రాముని అవతారంలో తన భక్తుడైన హనుమంతునిపై ఊరేగి భక్తులకు దర్శనమిస్తాడు. సాయంత్రం శ్రీనివాసుడు స్వర్ణరథాన్ని అధిరోహించి భక్తులను అనుగ్రహిస్తాడు. రాత్రి వేంకటాద్రీశుడు గజవాహనంపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిస్తాడు. 10న ఏడో రోజున ఉదయం సూర్యప్రభ వాహనంపై శ్రీమన్నారాయణుడు తిరుమాడవీధులలో విహరిస్తూ భక్తులను కటాక్షిస్తారు. రాత్రి శ్రీమలయప్పస్వామివారు చంద్రప్రభ వాహనంపై విహరిస్తూ తన రాజసాన్ని భక్తులకు చూపుతాడు. 11న ఎనిమిదో రోజు ఉదయం ఉభయదేవేరులతో కూడిన శ్రీమలయప్పస్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. రాత్రి అశ్వవాహనంపై విహరించి భక్తులను అనుగ్రహిస్తాడు. 12న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో చివరిదైన తొమ్మిదో రోజు ఉదయం చక్రస్నానం వేడుకగా జరుగుతుంది. రోజు రాత్రి బంగారు తిరుచ్చి ఉత్సవం తరువాత ధ్వజావరోహణం శాస్త్రోక్తంగా జరుగుతుంది. ధ్వజావరోహణ ఘట్టంతో తొమ్మిది రోజుల పాటు జరిగిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

భక్తులకు మెరుగైన సేవలందించాలి

డిప్యూటేషన్ సిబ్బందికి టీటీడీ ఈఓ సూచన

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు విశేషసేవలు అందించాలని, విధులను నిర్వర్తించడంతో పాటు, డిప్యూటేషన్ సిబ్బంది తమ పరిసరాలపై నిఘా ఉంచి, అప్రమత్తంగా ఉండాలని, సమస్యను పరిష్కరించడంలో ప్రముఖపాత్ర పోషించాలని టిటిడి ఈవో జె.శ్యామలరావు అన్నారు. తిరుమల ఆస్థాన మండపంలో గురువారం సాయంత్రం బ్రహ్మోత్సవాల విధులకు హాజరైన ఉద్యోగులను ఉద్దేశించి ఈఓ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు పోలీసులు, జిల్లా యంత్రాంగంతో టీటీడీ డిప్యూటేషన్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. అనంతరం అదనపు ఈఓ సిహెచ్ వెంకయ్య చౌదరి, సివిఎస్‌వో శ్రీధర్‌లు మాట్లాడుతూ గతంలో బ్రహ్మోత్సవాల సమయంలో ముఖ్యంగా గరుడసేవ రోజున ఉండే సమన్వయ సమస్యలు ఈసారి తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని డిప్యుటేషన్ అధికారులకు తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలను సమిష్టి కృషితో తమతమ విధులు నిర్వర్తించి విజయవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, ఎఫ్ఏసీఏవో బాలాజీ, సీపీఆర్‌వో డాక్టర్ టి.రవి, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి జిఎల్ఎన్ శాస్త్రి, ఇతర ఉన్నతాధికారులు, డిప్యూటేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ

పవన్ స్వామి.. కొత్త పీఠాధిపతి..

టిటిడి మాజీ ఛైర్మన్ కరుణాకర్ రెడ్డి

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న భూమన

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతిలో కాషాయం అవతారం ఎత్తిన పవన్ స్వామి కొత్త పీఠాధిపతి అని టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఎద్దేవా చేశారు. స్థానిక పద్మావతిపురంలోని ఆయన నివాసంలో గురువారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. గత 14 సంవత్సరాలుగా ఎప్పుడు కొండకు తీసుకురాని తన కూతుర్లను ఉన్నట్టుండి తీసుకొచ్చి, ప్రచారం కోసం డిక్లరేషన్ అంశాన్ని తెరపైకి తెచ్చారని విమర్శించారు. తన పిల్లలకి ఏనాడు హిందూ సాంప్రదాయక పద్ధతులు తలనీలాలు కూడా తీయించని వ్యక్తి సనాతన ధర్మం గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. తిరుపతిలో సభలో రాజకీయాలు మాట్లాడనని చెబుతూనే వైసీపీపై, జగన్మోహన్ రెడ్డిపై ఆఖరికి సుప్రీం కోర్టుపై కూడా ఆరోపణలు చేశారని గుర్తు చేశారు. సనాతన ధర్మం ప్రాచీన సంప్రదాయాల గురించి కనీసం ఓనమాలు కూడా తెలీని వ్యక్తి, ఇప్పుడు కొత్తగా పీఠాధిపతి అవుతారని విమర్శించారు. పవనే స్వయంగా తాను బాప్తిజం తీసుకున్నానని చెప్పి, గొడ్డు మాంసం తింటే తప్పేంటి అని, తనుకు ఏ మతం లేదని చెప్పిన వ్యక్తి, ఇప్పుడు తానే హిందూ మత రక్షకుడు అనేలా చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తిరుపతిలో పవన్ కళ్యాణ్ రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని, ఆఖరికి అయోధ్య శ్రీరాముడికి టిటిడి లక్ష కల్తీ లడ్లు పంపిందని పవన్ తేల్చేసారని తెలిపారు. రాముని పవన్ కళ్యాణ్ కొత్తగా ప్రజలకు పరిచయం చేస్తున్నాడని, రాముడు సత్యాలు నమ్మాడని, ఏకపత్నీవ్రతుడని, ఆయన్ని ఏ కోణంలో ఆదర్శంగా తీసుకున్నారో పవన్‌స్వామి చెప్పాలన్నారు. శ్రీవాణి ట్రస్ట్‌పై చేసిన ఆరోపణలు నిరూపించాలని డిమాండ్ చేశారు. పవన్‌స్వామి మనసు విషంతో నిండిందని, హిందూమతం పట్ల అరాచకాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తమ హయాంలో టీటీడీలో అనేక భక్తి కార్యక్రమాలు నిర్వహించామని, ఆయా కార్యక్రమాలను వివరించారు. హైందవ మతంపై అవగాహన లేని పవన్ కళ్యాణ్ నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. సమావేశంలో తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

మాజీ ఈవో ధర్మారెడ్డి ఏమయ్యారు..

- శ్రీవాణి ట్రస్టు డబ్బులు దోచేశారు..
- వారాహి సభలో పవన్ కల్యాణ్

సభలో మాట్లాడుతున్న పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి-తిరుపతి బ్యూరో, తిరుపతి సిటి

శ్రీవారి లడ్డు ప్రసాదంపై ఇంత వివాదం జరుగుతుంటే మాజీ ఈవో ధర్మారెడ్డి ఏమయ్యారు.. ఎక్కడ దాకున్నారు...? ఎందుకు నోరుమెదపడం లేదని రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ విమర్శించారు. తిరుపతి బాలాజీకాలని సర్కిల్ వద్ద గురువారం నిర్వహించిన వారాహి సభలో పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ మాజీ ఈవో ధర్మారెడ్డి పాలనలో శ్రీవాణి ట్రస్ట్ పేరుతో దర్శనానికి 10,500 వసూళ్లు చేసి, 500 రూపాయలకు మాత్రమే రశీదు ఇచ్చి, మిగత డబ్బులను దోచేశారని విమర్శించారు. తాను తనకి అన్యాయం జరిగిందని బయటకు రాలేదని, సనాతన ధర్మానికి అన్యాయం జరుగుతుంటే వచ్చాను, కల్తీ ప్రసాదాలు భక్తులకు పెట్టారని విమర్శించారు. వాళ్లకు దేవుడు 11 సీట్లు ఇచ్చిన బుద్దిరాలేదు, వాటిని ఒకటికే పరిమితం చేద్దామని పిలుపునిచ్చారు. తాను ఒక సనాతన హిందుత్వ వాదినిన, నా కూతురు క్రైస్తవ మతాన్ని ఆచరిస్తారని అందుకే తిరుమలలో తన చేత డిక్లరేషన్ ఇప్పించి, తన చిత్తశుద్ధిచాటానని వెల్లడించారు. నేను ఎప్పడు ధర్మాన్ని తప్పలేదు, ధర్మం కోసం పార్టీని, రాజకీయ జీవితాన్ని వదులుకోవడానికి కూడా సిద్ధమే అన్నారు. జంతువుల కొవ్వు కలిసిన నెయ్యితో తయారైన లక్ష లడ్డులు అయోధ్య రామాలయ ప్రారంభోత్సవానికి పంపారని, రాహుల్ గాంధీ కూడా సనాతన ధర్మం గురించి వ్యంగ్యంగా మాట్లాడం సరైనది కాదని అన్నారు. సెక్యులరిజం అంటే హిందుమతాన్ని అపహాస్యం చేయడం కాదని సూచించారు. అదే ఇస్లాం, క్రైస్తవ మతం గురించి విమర్శించే సాహసం చేయరని ఎద్దేవా చేశారు. సనాతన ధర్మం ఒక వైరస్, దానిని అంతం చేస్తామని ఒక యువ నాయకుడు అన్నాడు (తమిళనాడు డిప్యూటీ సిఎం ఉదయగిరి స్టాలిన్‌ను ఉద్దేశించి), సుడో సెక్యూలర్ వాదులకు ఇదే నా హెచ్చరిక సనాతన ధర్మాన్ని తుడిచి పెట్టేయాలంటే వెంకన్నస్వామి చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. సనాతన ధర్మం విషయంలో తప్పు జరిగిత ఎవ్వరు మాట్లాడం లేదని, దీనిపై మాట్లాడతే మతోన్మాదులు అవుతామా అని ప్రశ్నించారు. ఆలయ ప్రసాదాల నాణ్యత ధృవీకరించే విధానం తీసుకురావాలని, ఆలయాల కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలుగా కాకుండా విద్య, కళా, ఆర్థిక, పర్యావరణ, సంక్షేమ కేంద్రాలుగా మారాలని, అందుకు ఓ ప్రణాళిక సిద్ధం చేయాలని డిమాండు చేశారు. ఇటీవల సుప్రీంకోర్టు కొన్ని వ్యాఖ్యాలు చేసింది, కోర్టులపై నాకు గౌరవం ఉందన్నారు. లడ్డు కల్తీని సాదారణ అంశంగా తీసుకోవద్దు, పవిత్రత ఎలా దెబ్బతిందో ఆలోచించాలి. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా దర్శనానికి ఒక్కొక్కరి వద్దనుంచి 10వేలు తీసుకుని 500 రూపాయలకే రశీదు ఇచ్చారని, దీని ముందు లడ్డూ కల్తీలో అవినీతి చాలా చిన్నదని తెలిపారు. మాజీ సిఎం అమాయకుడిలా మాట్లాడుతున్నాడని, గుమ్మడికాయ దొంగ అంటే భుజాలు తడుము చూసుకుంటున్నాడని విమర్శించారు. నాడు కోర్టులను తిట్టిన వ్యక్తులు నేడు అమాయకుల్లా సుప్రీంకోర్టులకు వెళ్లుతున్నారని, చేతుల్లో కర్పూరం వెలిగించుకుని డ్రామాలు చేస్తున్నారని వైవి సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డిని ఉద్దేశించి ఎద్దేవా చేశారు. లడ్డు వివాదంపై అప్పటి ఈవో ధర్మారెడ్డి ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. కుమారుడు చనిపోతే శ్రీవారి ఆలయంలోకి వెళ్లి ధర్మారెడ్డి అపచారం చేశారని ప్రశ్నించారు. 29 పెండింగ్ కేసులు, 111 చార్జ్‌షీట్లు ఉన్న వ్యక్తి మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి అని విమర్శించారు. తిరుపతి ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు, పసుపులేటి హరిప్రసాద్, నరసింహయాదవ్, భాను ప్రకాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వారాహి సభకు హాజరైన జనం

ప్రశాంతంగా టెట్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి: ఉపాధ్యాయ అర్హత టెట్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 21వ వరకు 17రోజుల పాటు ఈ పరీక్షలు ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయి. రోజూ రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం తొమ్మిదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సెషన్-1 నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సెషన్ -2 నిర్వహిస్తారు. దివ్యాంగులకు అదనంగా 50 నిమిషాల సమయం కేటాయిస్తారు. తిరుపతి జిల్లాలో మూడు పరీక్ష కేంద్రాల్లో గురువారం నిర్వహించిన మొదటి స్పెషల్ పరీక్షకు 371 మంది అభ్యర్థులు హాజరు కావలసి ఉండగా 337 మంది మాత్రమే హాజరయ్యారు.63 మంది గైర్ హాజరయ్యారు. రెండో సెషన్ పరీక్షకూ 371 మంది హాజరు కావలసి ఉండగా వారిలో 342 మంది హాజరవగా, 29 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల్లో ఎక్కడా అవకతవకలు, అక్రమాలు జరగకుండా ఫ్లైయింగ్ స్క్వాడ్, జిల్లా పరిశీలకులు, తనిఖీ బృందాలను జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహిస్తుండటం వల్ల విద్యుత్ సరఫరా సహా సాకేంతిక సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు సహా పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఒక అభ్యర్థి స్థానంలో మరొకరు పరీక్షకు హాజరైనా, మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినా అభ్యర్థిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

ఏరియా ఆసుపత్రికి 'ఆక్సిజన్'

ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ఆక్సిజన్ నింపుతామని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. ఆక్సిజన్ ప్లాంటుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంతోపాటు, ఆసుపత్రి పరిసరాలను పచ్చదనంతో నింపనున్నట్లు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే బొజ్జల గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. పలు వార్డులను పరిశీలించి మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. రోగులకు అందుతున్న వైద్యంపై వారినే అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిలో పరిశుభ్రత చాలా బాగుందన్నారు. బాలింతలకు సాధారణ పడకలు కాకుండా, సౌకర్యవంతమైన 70 పడకలను ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆస్పత్రిలో మరమ్మతుల్లో ఉన్న ఆర్వో ప్లాంట్‌ను మల్లాడి డ్రగ్స్‌వారి సౌజన్యంతో రిపేరు చేయిస్తామని హామీ ఇచ్చారు. టిడిపి హయాంలో నెలకొల్పిన నెఫ్రోప్లస్ డయాలసిస్ కేంద్రం ప్రస్తుతం దీనస్థితిలో ఉందనీ, దానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. రానున్న 45 రోజుల్లో శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి రూపు రేఖలు మార్చి పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందజేస్తామని వెల్లడించారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, టిడిపి నాయకులు విజయ్ కుమార్ నాయుడు, కంటా రమేష్, జయచంద్ర నాయుడు, కన్నలి ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

దోమలు వృద్ధి చెందకుండా చర్యలు: కమిషనర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: వర్షాలకు నగరంలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల లార్వా వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయడం వంటి చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలో అక్కారంపల్లి, కొర్లగుంట, తదితర ప్రాంతాల్లో మురునీటి కాలువలను పరిశీలించి ఆయిల్ బాల్స్ వేయించే కార్యక్రమాన్ని కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నగరంలో ఎక్కడ నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో పెద్ద డ్రైనేజి కాలువల్లో చెత్త తొలగించడం వలన వర్షపు నీరు కొంతమేర సజావుగా వెళుతున్నాయని అన్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో మాత్రం మురుగు కాలువల్లో నీరు రోడ్లపైకి వస్తున్నాయని, అవి కూడా రాకుండా ఇంజినీరింగ్ అధికారులు, హెల్త్ అధికారులు కలసి చర్యలు చేపట్టాలన్నారు. ప్రతిరోజు కాలువల్లో, ఖాళీస్థలాల్లో చెత్త తొలగింపు పనులు చెపట్టాలన్నారు. పాడైన డ్రైనేజీ కాలువలకు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అక్కారంపల్లి చివర మురుగునీరు ఆగకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులు ఆదేశించారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, డీఈ.రమణ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి, సర్వేయర్ కోటేశ్వరరావు ఉన్నారు.

'ఇసుక' ఉచితం.. ప్రియం.. సుదూరం

- సామాన్యులకు అందని నాణ్యమైన ఇసుక
- 'కూటమి' చేతుల్లోకి వ్యాపారం



పెన్నలపాడు, పెద్దకనపర్తి ప్రాంతంలో ఇసుకను తోడుతున్న, తరలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందరోజులు దాటిపోయింది. ఉచిత ఇసుక ఇంకా సామాన్యుడి దరిచేరడం లేదు. గత ప్రభుత్వంలో అమలుపరిచిన ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా ఇసుక విక్రయ విధానానికి కూటమి ప్రభుత్వం బ్రేకులు వేసింది. 'ఉచిత ఇసుక'ను ప్రజల ముందుకు తీసుకొచ్చింది. ఈ ఏడాది జూలై నుంచి ఈ విధానం అమల్లో ఉంది. అయితే 'పెనంపై నుంచి పొయ్యిలో పడ్డ' చందంగా ఈ విధానం ఉందంటూ ప్రజలు నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సామాన్యులకు అవసరమైన నాణ్యమైన ఇసుక లభించడం లేదు. నాణ్యమైన ఇసుక కావాలంటే సుదూర ప్రాంతాల్లో ఉన్న రీచ్‌ల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. ఉచితం మాట పేరుకే గానీ, ట్రాక్టర్ ఇసుక ఇంటికి చేరే సరికి రూ.6వేలు దాటుతోంది. ఉచితం సంగతి అటుంచితే, స్థానిక అవసరాల మాటున కొందరు కూటమి నేతలు ఏరులు, వాగులు ఆక్రమించుకుని యథేచ్ఛగా ఇసుక దందాను కొనసాగిస్తున్నారు.

గతం కన్నా లేదు మిన్న..!

కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన ఇసుక విధానం పేరుకి గొప్ప గానీ ఆచరణలో మాత్రం గతం కన్నా గొప్పగా ఏమీ లేదన్న విమర్శ ఉంది. గత ప్రభుత్వ హయాంలో ట్రాక్టర్ (4 యూనిట్లు) ఇసుక ధర పట్టణ ప్రాంతాల్లో రూ.5 వేలు నుంచి రూ.6వేలు ఉండేది. గ్రామీణ ప్రాంతాల్లో రూ.3 వేల నుంచి రూ.4 వేలుగా ఉండేది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుక ఉచితమే అయినా పోలీసులు, రెవెన్యూ అధికారులు, కొందరు కూటమి నేతలకు రాయల్టీ పోను పట్టణ ప్రాంతాల్లోనైతే రూ.7వేలు, పల్లె ప్రాంతాల్లో అయితే రూ.3వేలకు లభిస్తోంది. నాణ్యమైన ఇసుక కావాలంటే అదనంగా మరో వెయ్యి జమ చేయాల్సి వస్తోంది. తిరుపతి జిల్లాలోని గూడూరులో నాసిరకం ఇసుక కావాలన్నా రూ.7 వేలు అవుతోంది. శ్రీకాళహస్తిలో ఇసుక రీచ్ లేకపోవడంతో నాగలాపురం మండలంలోని సుబ్బనాయుడు కండ్రిగ రీచ్ నుంచి ఇసుకను తెచ్చుకోవాల్సి వస్తోంది. రీచ్ వద్ద రూ.800, ప్రయాణ ఖర్చులు రూ.3వేలు కలుపుకుని ట్రాక్టర్ ఇసుక ఇంటికి చేరేందుకు రూ. 4వేలు అవుతోంది.

'కూటమి' చేతుల్లోకి ఇసుక వ్యాపారం

తిరుపతి జిల్లావ్యాప్తంగా ఇసుక వ్యాపారం కొందరు కూటమి నేతల చేతుల్లోకి వెళ్ళింది. ఉచిత ఇసుక మాటున కొందరు నేతలు నదులు, ఏర్లు, వాగులు, చెరువులను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. కూటమి నేతలతో కొందరు వైసీపీ నేతలు కూడా జతకట్టినట్టు సమాచారం. ముఖ్యంగా నాణ్యమైన ఇసుక లభించే శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని స్వర్ణముఖి నదిలో విచ్చలవిడిగా అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఇసుక తోడేళ్ల దాహానికి నదిలోని వంతెనలు, కాజ్వేలు సైతం కూలిపోయే ప్రమాదానికి చేరుకున్నాయి.

శ్రీకాళహస్తి మండలంలోని రామలింగాపురం, పుల్లారెడ్డి కండ్రిగ, ఏర్పేడు మండలంలోని పాతవీరాపురం ప్రాంతాల్లో కొందరు యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. తొట్టంబేడు మండలంలోని పెద్దకనపర్తి, పెన్నలపాడు ప్రాంతాల్లో అదే మండలానికి చెందిన ఇద్దరు కూటమి నేతలు స్వర్ణ ముఖి నదిలోకి గ్రావెల్ రోడ్డునే ఏర్పాటు చేసుకుని పగలూ, రాత్రి అన్న తేడా లేకుండా ఇసుక తవ్వకాలు చేస్తున్నట్లు సమాచారం. పెద్దపెద్ద హిటాచీలు, టిప్పర్ల సాయంతో వెంకటగిరి మీదుగా ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం. ఆ కూటమి నేతలకు ఉత్తరాంధ్రాకు చెందిన ఓ కీలక నేత అండదండలు ఉండడంతో అధికారులను, నిఘా వ్యవస్థలను అటు వైపు చూడకుండా మామూళ్ళతో మాయ చేస్తున్నారని తెలిసింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

ఈ విషయంపై తొట్టంబేడు తహశీల్దార్ మధుసూదన్ రావును వివరణ కోరగా గురువారం సాయంత్రం పెన్నలపాడు వద్ద స్వర్ణముఖి నది నుంచి ఇసుక తరలిస్తున్న ఆరు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. గృహ అవసరాలకు కాకుండా వ్యాపార నిమిత్తం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విరూపాక్ష పురం వద్ద ఇసుక రీచ్ నిర్వహణకు త్వరలో అనుమతులు రానున్నాయని చెప్పారు.

నేడు ఎంబీయూలో 'మోహన మంత్ర'

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): మోహన్ బాబు యూనివర్సిటీలో ప్రతిష్టాత్మకంగా ప్రతి ఏటా నిర్వహిస్తున్న 'మోహన మంత్ర' అట్టహాసంగా శుక్రవారం ప్రారంభం కానుంది. 4, 5, 6 తేదీలలో మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవంలో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి విద్యార్థులు తమ పేరు నమోదు చేసుకున్నారు. దాదాపు 20వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొనను న్నట్లు ఎంబియూ వీసీ ఆచార్య నాగరాజ రామారావ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మాజీ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రి రోగులకు పాలు, పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి హాజరయ్యారు. వైసిపి కార్యకర్త అంజూరు జన్మదిన వేడుకల్లో పాల్గొని రోగులకు పండ్లు పంపిణీ చేయడం ఆనందంగా ఉందని ఆయన అన్నారు. మాజీ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు బుల్లెట్ జయశ్యామ్, కంట ఉదయ్, పగడాల రాజు, చందమామల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

'న్యాయం చేయండి'

ప్రజాశక్తి-కోట: ఇంటి స్థలం ఆక్రమణకు గురైందని తమకు న్యాయం చేయాలని ఇల్లకూరుపాడు దళితవాడకు చెందిన బాధిత కుటుంబ సభ్యులు తహశీల్దార్ జయజయ రావును కోరారు. గురువారం కోట మండలంలోని సిద్దవరం పంచాయతీలోని ఇల్లకూరుపాడు దళితవాడకు చెందిన దామరపు పేమలత గత కొన్ని సంవత్సరాల క్రితం 33అంకణాల ఇంటి స్థలాన్ని తమ వద్ద కొనుగోలు చేశారని తెలిపారు. అయితే ప్రస్తుతం కొనుగోలు చేసిన ఆ ఇంటి స్థలాన్ని స్థానిక గ్రామానికి చెందిన పలువురు ఆక్రమించుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారని తహశీల్దార్కు వివరించారు. అంతే కాకుండా విచారించి తమకు న్యాయం చేయాలని వినతిపత్రంను అందజేశారు. తక్షణమే స్పందించిన తహశీల్దార్ గ్రామానికి విఆర్వోను పంపి విచారణ చేస్తామని బాధితులకు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, దామరపు బాబు, బాధిత కుటుంబ సభ్యులు ఉన్నారు.

12 నుంచి ప్రైవేట్ మద్యం దుకాణాలు

- జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి నాగమల్లేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి-గూడూరు టౌన్: ప్రభుత్వం నూతన మద్యం విధానం ప్రవేశపెట్టిన నేపథ్యంలో గూడూరు పట్టణంలో 12మద్యం దుకాణాలు, చిల్లకూరు మండలంలో 6మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నాయని, మొత్తం 18ప్రైవేటు మద్యం దుకాణాలకు ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అప్లికేషన్లను స్వీకరించడం జరుగుతుందని, సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి నాగమల్లేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. గూడూరు ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11తేదీన ఉదయం 8గంటలకు తిరుపతిలోని శిల్పారామంలో కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ ద్వారా మద్యం దుకాణాల ఎంపిక ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో 12వ తేదీ నుంచి కొత్తగా కేటాయించబడిన ప్రైవేటు మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నట్లు తెలిపారు. ఈ నెల 11వ తేది సాయంత్రం వరకు ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఊహశ్రీ, సీఐలు కరీమాబేగం, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి నాగమల్లేశ్వర్ రెడ్డి

30 మద్యం దుకాణాలకు అనుమతి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఎక్సైజ్ శాఖ డివిజన్ పరిధిలో 30 ప్రైవేటు మద్యం దుకాణాల నిర్వహణకు అనుమతినిస్తున్నామని సీఐ లావణ్య తెలిపారు. గురువారం ఆమె కార్యాలయంలో మాట్లాడుతూ శ్రీకాళహస్తి పట్టణ పరిధిలో రూ.65లక్షల వార్షికాదాయంతో 12షాపులు, తొట్టంబేడులో 3(రూ.55లక్షలు), బుచ్చినాయుడు కండ్రిగ మండలం(రూ.55 లక్షలు) కేవీబీపురంలో 3 షాపులు (రూ.55 లక్షలు), ఏర్పేడులో 7 షాపులు(రూ.65 లక్షలు) నిర్వహణకు అనుమతులు వచ్చాయన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 9వ తేదీ లోపు స్థానిక ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో టెండర్ దాఖలు చేసుకోవచ్చని సూచించారు. ఈ నెల 11న తిరుపతి శిల్పారంలో బిడ్ను ధ్రువీకరిస్తారని వివరించారు.

మనోజ్ కుమార్కి సేవా పురస్కారం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణానికి చెందిన గిద్దలూరు మనోజ్ కుమార్కి రెడ్ క్రాస్ అవార్డు అందుకున్నారు. గురువారం నెల్లూరులో గిద్దలూరి రమణయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం అదేవిధంగా 200యూనిట్లు రక్తదానం చేయడం ద్వారా బెస్ట్ మోటివేటర్ అవార్డును రెడ్ క్రాస్ నెల్లూరు ఛైర్మన్ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అవార్డును అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు చిన్న, ప్రదీప్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వరదయ్య పాలెం: ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని గురువారం నెల్లూరులోని రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్లో రక్తదాతలకు రెడ్ క్రాస్ ఛైర్మెన్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి చేతులమీదుగా సేవా పురస్కారాలు అందుకున్నారు. కార్యక్రమంలో అజయ్ బాబు, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

తడ: జాతీయ రక్త దాన దినోత్సవం సందర్భంగా తడ మండలంలోని టీచర్ ఉస్మాన్ బాషా నెల్లూరులో అవార్డును అందుకున్నారు.

'ఇష్టానుసారం మెనూలో మార్పులొద్దు'

వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-సత్యవేడు: మధ్యాహ్న భోజనంలో ఇష్టానుసారం మెనూ మార్పులు మార్చకూడదని విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘ నాయకులు మురళి, నాగార్జునలు ఎంఈవోకి వినతి పత్రం అందించారు. మండలంలో పుదుకుప్పం జెడ్పీ ఉన్నత పాఠశాలతో సహా అనేక పాఠశాలల్లో నాడు–నేడు పథకం కింద నిర్వహించిన పనులలో నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపించారు. ఈ విషయంగా ఎంఈవో రవి స్పందిస్తూ తమ దృష్టికి వచ్చిన వాటిపై చర్యలు తీసుకుంటున్నానని స్పష్టం చేశారు.

న్యాయ కళాశాల అనుమతులపై విచారణ చేపట్టాలి: టీఎన్ఎస్ఎఫ్

ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వీయూ పరిధిలో నూతనంగా న్యాయ కళాశాలలకు అనుమతులలో తీవ్రమైనటు వంటి అవకతవకలకు పాల్పడినటు వంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టిఎన్ఎస్ఎఫ్ నేతలు అశోక్, రామకృష్ణ నాయుడు డిమాండ్ చేశారు. గురువారం ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడుకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లా డుతూ వర్సిటీ పరిధిలో కొత్తగా ఏర్పాటైన పుత్తూరు లోని కేఎంఆర్ న్యాయ కళాశాల, తిరుపతిలోని రాయలసీమ న్యాయ కళాశాలలకు వర్సిటీ ద్వారా ఎటువంటి నోటిఫికేషన్ ద్వారా కాకుండా అప్పటి మంత్రి రోజా, అప్పటి ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి అవినీతి, అక్రమాలకు పాల్పడి న్యాయ కళాశాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చారని ఆరోపించారు. ప్రస్తుతం ఆ న్యాయ కళాశాలలో వర్సిటీకి సంబంధించి ఎటువంటి నియమ నిబంధనలు పాటించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే బిల్డింగ్లో నాలుగు కళాశాల నడుస్తున్న అదే బిల్డింగ్లో కొత్తగా న్యాయ కళాశాల కోసం అనుమ తులు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. వర్సిటీ మాజీ వీసీ, రాష్ట్ర సీనియర్ మంత్రి మిత్రులు అనే పేరుతో అనేక అవినీతి, అక్రమాలకు వర్సిటీలో పాల్పడ్డారని ఆరోపించారు. యూనివర్సిటీ అధికారులు తక్షణం ఆయా కళాశాలలపై చర్యలు తీసుకోవాలని, అనుమతులు నిలిపి వేయాలని కోరారు. కార్యక్రమంలో వీరభద్ర, రాజు, పాల్గొన్నారు.

'తిరుపతిలో ఓపెన్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి'

ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతిలో ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి డిమాండ్ చేశారు. స్థానిక బైరాగిపట్టెడలోని జిఎస్కె భవన్లో ఏఐఎస్ఎఫ్ నేతల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు చేసిన ఏపీ సార్వత్రిక విశ్వావిద్యాలయం రాష్ట్ర విభజన అనంతరం అనేక సవాళ్లను ఎదుర్కొంటుందని ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఏకంగా ఆంధ్రప్రదేశ్లో అడ్మిషన్లు నిలిపివేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. కూటమి ప్రభుత్వం, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ ఓపెన్ యూనివర్సిటీని అమరావతికి తరలించి ప్రయత్నం చేస్తున్నారని, కేవలం అమరావతిని అభివృద్ధి చేస్తే రాయలసీమలో ఉన్న విద్యార్థులు పరిస్థితి అంధకారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతిలోనే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్, నవీన్, ప్రవీణ్, ఓం రాజ్, వినయ్, హరి, మోహన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తమ పూర్వీకుల స్వయార్జితంగా వచ్చిన స్థలంలో దుకాణం ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేసుకొంటుంటే జయచంద్ర, రమేష్, ప్రసాద్, లక్ష్మీదేవి అనే వ్యక్తులు తమ దుకాణం వద్దకు వచ్చి దౌర్జన్యం చేస్తూ వ్యాపార సామాగ్రిని ధ్వంసం చేసి భౌతికంగా దాడిచేసి గాయపరచారని తిరుచానూరు బండ్ల మిట్ట వీదికి చెందిన అనుష తెలిపారు. గురువారం ప్రెస్క్లబ్లో ఆమె మాట్లాడారు. ఈ నెల ఒకటో తేదీన జయచంద్ర, రమేష్, ప్రసాద్, లక్ష్మీదేవి 20మందితో దుకాణంపై దాడి చేసి మనుషులను ఏర్పాటు చేసి కూల్చివేశారన్నారు. తాము ఏర్పాటు చేసుకున్న దుకాణ స్థలంపై కొందరు కోర్టులో కేసు వేశారని, ఈ అంశం కోర్టులో విచారణ జరుగుతుండగానే ఇలా భౌతికంగా దాడులు చేసి, లక్షల విలువ గల వ్యాపార సామాగ్రిని ధ్వంసం చేశారన్నారు. దీనిపై తిరుచానూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే అక్కడి మహిళా పోలీసు మాపై దౌర్జన్యం చేసి ఫిర్యాదును మార్చారని ఆరోపించారు. ఎస్పీకి ఇప్పటికే దీనిపై ఫిర్యాదు చేశామని, అమానుషంగా దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో తనుష పాల్గొన్నారు.

ఉద్యాన పంటలు పరిశీలన

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): చంద్రగిరి మండలంలోని భీమవరం, పాకాల మండలంలోని వల్లివేడులో జిల్లా ఉద్యాన అధికారి బి.దశరథ రామిరెడ్డి గురువారం ఉద్యాన పంటలను పరిశీలించారు. ఈ–పంట ద్వారా నమోదు చేసిన పంటలను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సహకాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో చంద్రగిరి మండల ఉద్యాన అధికారిణి ఎస్.శైలజ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మామిడి చెట్లును పరిశీలిస్తున్న అధికారులు

తప్పిన పెను ప్రమాదం..

- వర్షానికి కూలిన బస్సు షెల్టర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాత్రి కురిసిన వర్షానికి తిరుపతి–కరకంబాడి మార్గంలోని అత్తూరు డాబా సమీపంలో ఉన్న ఓ బస్సు షెల్టర్ రోడ్డు పైకి కూలిపోయింది. సాధారణంగా ఈ బస్సు షెల్టర్లో మద్యం అధికంగా సేవించిన వారు, సమీప ప్రాంతాల్లో భిక్షాటన చేసి బస్సుషెల్టర్లో తలదాచుకుని నిద్రిస్తూ ఉంటారు. ప్రమాదవశాత్తు బస్సు షెల్టర్ కూలిన సమయంలో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఎటువంటి ప్రమాదం జరగక ముందే వాటికి మరమ్మతులు చేయాలని స్థానికంగా ఉన్న ప్రజలు కోరుతున్నారు.

అత్తూరు డాబా వద్ద కూలిన బస్సు షెల్టర్

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపండి

3వ రోజు నిరసన దీక్ష

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజాసంఘాలు తిరుపతి సబ్కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్షలు గురువారం మూడోరోజు విజయవంతంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా సిపిఎం రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హేమలత, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు (సిపిఐ) రామానాయుడు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలపై ఐక్యపోరాటాల ద్వారానే విజయాలు సాధించగలమని, అందుకు ఈ మూడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా జరిగిన విశాఖఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటంలో పాల్గొన్న ప్రజాసంఘాల ఐక్య ఉద్యమాలే నిదర్శనమన్నారు. ఉద్యమాల ద్వారానే 4200 మంది కాంట్రాక్ట్ కార్మికులను విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ యాజమాన్యం దిగివచ్చి ఆ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవడం జరిగిందని, ఈ విజయం కార్మిక, ప్రజా విజయమన్నారు. సిఐటియు జిల్లా నాయకులు జి.బాలసుబ్రమణ్యం, నాయకులు మునిరాజా, ప్రజానాట్యమండలి రాష్ట్రకార్యదర్శి చిన్నపెంచలయ్య, మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు జయలక్ష్మి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల ద్వారా అధికారంలోకి వచ్చిన కూటమీ ప్రభుత్వం కేంద్రం అండిస్తున్న రీతిలో ఆడుతోందని, ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని విమర్శించారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏవి కూడా అమలుపరచడం లేదని దీనికి వ్యతిరేకంగా పెద్దఎత్తున పోరాటాలకు కార్మికవర్గం, ప్రజలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్డి.రవి, వేణుగోపాల్, బుజ్జమ్మ, రంగయ్య, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎన్.చంద్రశేఖర్ రెడ్డి, కెవై రాజా, శివ ఉదయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను విరమించుకోవాలని మండల కేంద్రంలోని గోడగడియారం కూడలి వద్ద సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీల నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. సిపిఎం నాయకులు మెలుగు రమేష్, సిపిఐ నాయకులు చిన్నరాసు, విద్యార్థి సంఘ నాయకులు టి.మురళి, నాగార్జున, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జి.రఘునాథ్, సిపిఎం నాయకులు మునస్వామి, కిష్టయ్య, శేఖర్, సుబ్రమణి, చిన్నరాజు చంద్రబాబు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-రేణిగుంట: రైలు పట్టాల కింద పడి మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం రేణిగుంట రైల్వేస్టేషన్ సమీపంలో వెలుగుచూసింది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. పూడి–రేణిగుంట మార్గ మధ్యలో బుధవారం రాత్రి సుమారు 9:30గంటలకు గుర్తు తెలియని మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ రవి తెలిపారు.

టిటిడి సొంత డెయిరీని ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుమల శ్రీవారి అన్న ప్రసాదాలకు అవసరమైన నెయ్యిని టిటిడి సొంతంగా తయారు చేసి వినియోగించుకునేలా ఓ డెయిరీని ఏర్పాటు చేసి శ్రీవారి భక్తులను భాగస్వామ్యం చేయాలని అఖిల భారతీయ యాదవ మహా సంఘం తిరుమల అధ్యక్షులు శ్రీను యాదవ్ టిటిడి, ప్రభుత్వ పెద్దలకు విజ్ఞప్తి చేశారు. గురువారం ప్రెస్క్లబ్లో యాదవ సంఘం యువతతో కలిసి శ్రీను యాదవ్ మాట్లాడారు. సనాతన ధర్మం అంటే మతం కాదని, ఆచరించతగిందని నిరూపించడానికి ఇటీవల బిసివై పార్టీ వ్యవస్థాపకులు తిరుమలకు పాదయాత్రగా వచ్చిన సమయంలో టిటిడి డెయిరీ ఏర్పాటు చేస్తే తాను వెయ్యి ఆవులను ఇస్తానని, అలానే లక్ష ఆవులను డెయిరీకి సమకూర్చుతానని ప్రకటించారని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులను డెయిరీ ఏర్పాటు, నిర్వహణలో భాగస్వామ్యం చేయగలిగితే శ్రీవారి ప్రసాదాలు మరింతగా నాణ్యత పెంచడంతో పాటు ఎటువంటి విమర్శలు రాకుండా భక్తులకు అన్న ప్రసాదాలను అందజేసే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా డెయిరీ ఏర్పాటుపై కరపత్రాలను ఆవిష్కరించారు. విలేకరుల సమావేశంలో చంద్రా యాదవ్, మాసుమయ్య, మహేష్ యాదవ్, చెంగల్రాయులు, ధన పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

చెరువు కాలువ ఆక్రమణ

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని కందాడు పంచాయతీలో కందాడు చెరువుకి గత 40 సంవత్సరాలుగా ఎగువరెడ్డి గుంట నుంచి వర్షాకాలంలో మిగులు నీరు శివగిరి కాలనీ మధ్యలో ఫారెస్ట్ కాలవ గుండా నీరు ప్రవహిస్తుంది. అటువంటి కాలువను సదాశివపురం గ్రామానికి చెందిన కొంతమంది రైతులు తమ పొలాలలో ఆక్రమించుకొన్నారు. ఆ వరవ కాలువను పూడ్చేయడంతో కందాడు చెరువుకు నీరు రాక ఆయకట్టదారులు ఇబ్బంది పడుతున్నారు. కందాడు చెరువు కింద సుమారు 250ఎకరాలు ఆయకట్టు పారుతుందని, అసలు కాలవే లేకుండా చేస్తే రైతులకు సాగునీరు ఎలా అందుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి సర్వే చేయించి ఆక్రమణదారుల నుంచి దురాక్రమణలను తొలగించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఆక్రమణలో చెరువు కాలువ

'యుజి సమస్య పరిష్కరించాలి'

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: నగరంలోని సుందరయ్య నగర్లో అండర్ డ్రైనేజ్ మురుగు రోడ్డుపై ప్రవహిస్తూ ప్రజలకు ఇబ్బందికరంగా ఉందని, వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానికులతో కలిసి సిపిఎం నేతలు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం, నగర కమిటీ సభ్యులు ఎం.నరేంద్ర, నగర కార్యదర్శి వర్గ సభ్యులు కే.వేణుగోపాల్, పి.బుజ్జి మాట్లాడుతూ సుందరయ్య నగర్లో అనేక వీధులలో అండర్ డ్రైనేజ్ సమస్య తీవ్రంగా ఉందని, ప్రజలు నిత్యం చాలా ఇబ్బందులు ఎదురుకుంటున్నారని తెలిపారు. వర్షం పడితే డ్రైనేజీ సమస్య మరింత తీవ్రంగా ఉంటుందని, రోడ్లపై నడిచే పరిస్థితి లేదన్నారు. మునిసిపల్ అధికారులు సమస్య పరిష్కారానికి శాశ్వత పరిష్కారాన్ని చూపాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత వర్షాకాలం సీజన్లో నిత్యం అండర్ డ్రైనేజీ పొంగడం వల్ల డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు వచ్చే అవకాశం ఉందని, కనుక పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని మున్సిపల్ అధికారులను కోరారు. సమస్య పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.జయచంద్ర, పి.సాయిలక్ష్మి, నగర కమిటీ సభ్యులు ఎం.జయంతి, టి.రామకృష్ణ, ఆర్.మల్లికార్జున్ రావు, బాలాజీ, ఈశ్వరయ్య, లోకేష్, యూసఫ్, తంజావూరు మురళి, డివైఎఫ్ఐ నాయకులు సోము, పవన్ స్థానికులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా యువకుడు మృతి

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన గురువారం వెలుగుచూసింది. పోలీసులు కథనం మేరకు.. చంద్రగిరి పట్టణం భారతి నగర్కు చెందిన హేమంత్(22) అనుమానాస్పద రీతిలో బావిలో మృతి చెందిన విషయం స్థానికులు తెలుసుకున్నారు. చంద్రగిరి మండలం, బుచ్చినాయుడుపల్లి పొలాలలో ఉన్న బావిలో తేలియాడుతున్న యువకుడి మృతదేహాన్ని చూసి స్థానికులు పోలీసులకు సమాచారాన్ని ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలన చేశారు. యువకుడి మృతిపై విచారిస్తున్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. తల్లి వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏఈగా ఇబ్రహీంఖాన్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-సత్యవేడు: సత్యవేడు మండలం పంచాయతీ రాజ్ ఏఈగా గురువారం ఇబ్రహీంఖాన్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన నంద్యాల జిల్లా కోవెలకుంట్లలో పీఆర్ ఏఈగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

'జూనియర్ కళాశాలలో టపాకాయల కేంద్రం వద్దు'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో దీపావళి పండుగను పురస్కరించుకొని టపాకాయల కేంద్రాన్ని నిర్వహించొద్దంటూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నాయకులు కోరారు. గురువారం ఆ సంఘం నాయకులు మున్సిపల్ కమిషనర్, శ్రీకాళహస్తి తహశీల్దార్, అగ్నిమాపక శాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జాకీర్ మాట్లాడుతూ కాలేజీ ఆవరణలో టపాకాయల కేంద్రం నిర్వహణ ప్రమాదమని తెలిసినా అధికారులు ప్రత్యేక అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు. కళాశాలకు సమీపంలో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి, ఇంటిగ్రేటెడ్ హాస్టల్, ఎంజీఎం విద్యాసంస్థలు, విద్యుత్ సబ్ స్టేషన్, అన్న కాంటీన్, ఆర్అండ్బి కార్యాలయం, బస్ స్టేషన్లు ఉన్నాయని ఆయన అన్నారు. ఒక వేళ టపాకాయల విక్రయ వద్ద అగ్ని ప్రమాదం జరిగితే వీటన్నిటి పైన ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. అంతే కాకుండా టపాకాయల కేంద్రాన్ని ఇక్కడ నిర్వహించడం వల్ల ఏరియా ఆసుపత్రికి వెళ్లే దారిలో రెండు రోజుల పాటు భారీగా రద్దీ ఏర్పడుతోందనీ, ఫలితంగా అంబులెన్సులు వెళ్లేందుకు ఇబ్బంది కలుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్ని తెలిసిన సంబంధిత అధికారులు మామూళ్లకు ఆశపడి ఎప్పటిలాగే అనుమతులు ఇస్తున్నారని మండిపడ్డారు. జిల్లా కలెక్టర్ స్పందించి జూనియర్ కళాశాల ఆవరణలో టపాకాయల విక్రయ కేంద్రాన్ని ఎత్తివేసి, బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. మణికంఠ, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

వినతి పత్రం అందిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

యువకుల మధ్య ఘర్షణ

- ముగ్గురికి కత్తిపోట్లు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: యువకుల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురు కత్తిపోట్లుకు గురైన సంఘటల గురువారం పట్టణంలో చోటుచేసుకుంది. ఒకటో పట్టణ పోలీసుల కథనం మేరకు.. గూడూరు పట్టణంలో బుధవారం రాత్రి ప్రారంభమైన జెండా ఉత్సవాల్లో గురువారం వేకువ జామున రెండు వేర్వేరు సంఘటనలలో ముగ్గురు యువకులు కత్తిపోట్లుకు గురై గాయపడ్డారు. స్థానిక చిన్న మసీదువీధికి చెందిన హరీష్ అనే యువకుడు గత కొంతకాలం నుంచి తిరుమలలో ఉంటూ డ్రైవర్గా జీవనం సాగిస్తున్నాడు. జెండా ఉత్సవాలను తిలకించేందుకు స్థానిక చిన్న మసీదు వీధిలో ఉంటున్న బంధువులు యశ్వంత్ ఇంటికి వచ్చాడు. యశ్వంత్తో కలిసి జెండాలను తిలకిస్తున్నాడు. మసీదువీధి ప్రాంతంలో జెండా ఊరేగింపులో కొందరు యువకులు గొడవపడుతూ యశ్వంత్పై పడ్డారు. ఇంతలో ఎందుకు పడ్డారని యశ్వంత్.. స్థానిక అరుందతీవాడకు చెందిన గోవిందు అనే యువకుడిని అడగడంతో వివాదం జరిగి గోవిందు కత్తితో యశ్వంత్ పై, హరీష్ పై దాడి చేసి గాయపరిచారు. గాయపడిన యశ్వంత్, హరీష్లను స్థానిక ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించి మెరుగైన వైద్యం కోసం నెల్లూరు ఒకు తరలించారు. ఈ మేరకు పట్టణ సీఐ శేఖరబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అదే విధంగా స్థానిక కృష్ణామందిరం వీధికి చెందిన రెహమాన్ అనే యువకుడు అతని స్నేహితుడు భాస్కర్తో కలిసి జెండా ఉత్సవాల్లో శివాలయం వద్ద ఉన్నారు. గురువారం వేకువన పట్టణానికి చెందిన ఇమ్మానియేలు అనే వ్యక్తి అక్కడకు వచ్చాడు. భాస్కర్కు, ఇమ్మానియేలుకు పాత గొడవలు ఉండడంతో వారిద్దరు గొడవపడ్డారు. దీంతో వీరిని అడ్డం తీసేందుకు అబ్దుల్ రెహమాన్ వెళ్లగా ఇమ్మానియేలు తోసివేయడంతో అబ్దుల్ రెహమాన్ కిందపడ్డాడు. ఇంతలో పక్కనే ఉన్న ఇమ్మానియేలు స్నేహితుడు పట్టణానికి చెందిన శ్రీనాద్ అనే యువకుడు కత్తితో అబ్దుల్ రెహమాన్ను పొడిచి గాయపరిచాడు. గాయపడిన యువకుడిని చికిత్సనిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుడి పిర్యాదు మేరకు పట్టణ సీఐ శేఖరాబాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DEVISION): PUTTUR
H.M.O.P. NO.41/2024

Between:
Bandi Vasudeva Reddy @ Babu Reddy ...Petitioner
And
Yeddala Sukanya @ Subhakany ... Respondent

NOTICE TO RESPONDENT

To
Bandi Sukanya,W/o Bandi Vasudeva Reddy @ Babu Reddy, D/o Y Chenga Reddy, Hindu, aged about 30 years, House wife, permanent resident of Nuthuguntapalli Village, Bopparajapalli Post, R.C.Puram Mandal, Tirupati District, (Adar No. 356385284027 & Mobile No.9704224547)

Madam
Please take Notice that the petitioner filed the above petition against you for divorce before the above said court. The said Petition is posted to 24-10-2024 for your appearance. If you have got any objection you may appear on 24-10-2024 at 10.30 A.M. either in person or through your Advocate and file your objections. In the event of your failure, the matter will be decided exparte.

Sri Modi Sanjeevi, M.A., L.L.M.,
Advocate for Petitioner, PUTTUR.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT PUTTUR
I.P.No. 8 Of 2024

Between
Pandaram Gopi ...Petitioner
And
1.P.Ramesh, 2.T.Chengalrayulu, 3.A.Subba Reddy, 4. V.Rama Murthy, 5. M.Parasu Ramudu, 6. K.Murali, 7. A.K. Pavan Kumar, 8. S.Kannivelu Reddy, 9. T.Bhupathi, 10.B.Anki Reddy, 11.Poojali Krishna, 12.K.Prakash, 13. Sundaram Finance, rep. by, it's Branch Manager, 14. HDB Financial Service Ltd., rep. by it's Branch Manager, 15. IIFL Financial Service Ltd., rep. by, it's Branch Manager 16. Ring Financial Service, rep. by It's Branch Manager 17. M/s.Shriram Finance rep. by, it's Branch Manager, 18. Devendra Chits rep. by it's Branch Manager 19. Aruna Chits rep. by it's Branch Manager
20. P.Subramanyam Reddy 21. P.Vanitha ...Respondents

INSOLVENCY NOTICE TO R1 TO R21

The Petitioner by name Pandaram Gopi filed insolvency petition against the R1 to R21 before the Senior Civil Judge,Puttur and the same was numbered in IP No.8/2024 and its hearing Dt:14-11-2024, this is for kind information.

V.KRISHNA REDDY
ADVOCATE, TIRUPATI

RCR INSTITUTE OF MANAGEMENT & TECHNOLOGY
(Approved by AICTE, New Delhi & Affillated to S.V. University, Tirupati)
#1, RCR Avenue, Karakambadi, Tirupati - 517520
Cell: 9866301566 / 7981054407
ICET Code : RCRM

SPOT ADMISSIONS FOR THE ACADEMIC YEAR : 2024-25

Vacant Seats in **MBA, MCA** Courses due to non-reporting / Dropouts / unfilled seats to be filled up by the college. Interested candidates may attend for the **SPOT ADMISSIONS** with all original certificates on **06.10.2024 at 10.00 am** in the college premises.

ADMISSION NOTIFICATION FOR B-CATEGORY SEATS

Applications are invited from the eligible candidates for Admission into **MBA, MCA** Courses for the Academic Year **2024-25.**

COURSE	INTAKE	B-CATEGORY SEATS
MBA	180	54
MCA	180	54

Applications can be obtained from the college office or downloaded from the website : **rcrimt.edu.in.** Filled in applications with all original certificates shall be submitted at office on or before **06.10.2024.** Admissions will be made as per the guidelines of **APSCHE.**

PRINCIPAL